క్లుప్తంగా

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలోని వంగలి, అంతకాపల్లి సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించనున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాల నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభల్లో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని దరఖాస్తు దారులకు పలు రకాల ధ్రువ పత్రాలు అందజేస్తారన్నారు. అదేవిధంగా ప్రజలు వలంటీర్ల ద్వారా తెలియజేసిన సమస్యలపై అధికారులతో చర్చిస్తారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సచివాలయాల పరిధిలో నిర్వహించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం



బీఎంఎస్ వ్యవస్థాపక వేడుకల్లో పాల్గొన్న యూనియన్ ప్రతినిధులు, కార్మికులు

పరవాడ: సింహాద్రి కాంట్రాక్టు కార్మిక సంఘ(బీఎంఎస్) ఆధ్వర్యంలో భారతీయ మజ్దూర్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్ గేటు వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు బొట్టారమణ పతాకావిష్కరణ చేశారు. సంఘ కోశాధికారి లాలం ప్రసాద్ మాట్లాడుతూ సమాజ అవసరాలు తీర్చడానికి బలమైన కార్మిక శక్తిని నిర్మించడానికి భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, బురద తాతబాబు, జి.నాగభూషణ రావు, కె.వాసు, బి.బాలాజీ, బి.మూర్తి, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం



ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజుకు విరాళం చెక్ అందజేస్తున్న వైస్ ఎంపీపీ గోవింద్

సబ్బవరం: మండలంలోని వంగలిలో శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పాడేరు నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు రూ.50వేలు విరాళం ఇచ్చారు. ఆ విరాళం మొత్తాన్ని చెక్ రూపంలో గ్రామంలో నిర్మిస్తున్న ఆలయం వద్ద మండల వైస్ ఎంపీపీ, ఆయన సోదరుడు చొక్కాకుల గోవింద్ ఆదివారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు గవర రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు కోట్ని నాయుడు,వేపాడ స్వామినాయుడు,జెట్టి హేమంత్, కందా అప్పల స్వామి,జెట్టి స్వామినాయుడు, మేడపురెడ్డి జగన్నాథం, దేవుడుబాబు పాల్గొన్నారు.

శ్రావణ్‌కుమార్ నియామకంపై హర్షం



పేరిశ్రావణ్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న జ్వాలాపురం శ్రీకాంత్

సింహాచలం: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధిగా సింహాచలంకి చెందిన పేరి శ్రావణ్‌కుమార్ నియమితులయ్యారు. కర్నూలులో ఆదివారం సాయంత్రం జరిగిన ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సమావేశంలో శ్రావణ్‌కుమార్‌ను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్ నియామక పత్రం అందజేశారు. రెండేళ్లపాటూ శ్రావణ్‌కుమార్ అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కార్యకమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాల మధుసూదన శర్మ, ప్రధాన కార్యదర్శి పురుషోత్తమశర్మ తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రావణ్‌కుమార్ నియామకంపై స్థానిక బ్రాహ్మణ సంఘాల ప్రతినిధుల హర్షం వ్యక్తం చేశారు.

ప్రజల చెంతకే వైద్యం



సబ్బవరం మండలం చినయాతపాలెం గ్రామ విలేజ్ క్లినిక్‌లో వైద్యసేవలందిస్తున్న వైద్యులు

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో మెరుగైన వైద్య సేవలు

గ్రామీణ ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ మోహన్‌రెడ్డి ధ్యేయం. అందులో భాగంగా ఆరోగ్యశ్రీని అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లారు. దాంతోపాటు విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రజల చెంతకు వైద్య సేవలు చేరువ చేశారు. గ్రామాల్లోనే వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు రక్త పరీక్షలు, వంద రకాలకు పైగామందులు అందజేసి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారు.

పరవాడ/సబ్బవరం: వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం చేరువ అయింది. చిన్న పాటి ఆరోగ్య సమస్యకు కూడా దూరంగా ఉన్న ఆస్పత్రులు, ప్రైవేటు వైద్యుల చుట్టూ తిరగాల్సిన బాధలు తప్పాయి. వైద్యం అంటే డబ్బు ఖర్చు అనే భయం పోయేలా ఈ క్లినిక్‌లు విశేష సేవలందిస్తున్నాయి. ప్రజల మన్ననలు పొందుతున్నాయి.



గ్రామాల్లోనే వైద్య పరీక్షలు

సుమారు రెండేళ్ల కిందట గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు రావాలనే సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు శ్రీకారం చుట్టారు. అవసరమైన వైద్యాధికారులను, సిబ్బందిని నియమించారు. ఈ క్లినిక్‌లు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులిస్తూ సేవలందిస్తున్నాయి. తరచుగా అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లకు వెళ్లి పిల్లల్లో రక్త హీనత నివారణకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. రక్త హీనత, ఎదుగుదల తక్కువగా ఉన్న వారికి మందులను ఉచితంగా అందిస్తూ వారి శారీరక వికాసానికి దోహదపడుతున్నారు. విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు ఉచితంగా అందిస్తున్నారు. దీర్ఘకాలిక రోగాలైన మధుమేహం, బీపీ నివారణకు రక్త పరీక్షలు నిర్వహించి మందులిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఉంటే సమీపంలోని పీహెచ్‌సీ, అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు.

నెలకు సరిపడా మందులు...



నాకు బీపీ, మధుమేహం ఉంది. గతంలో పీహెచ్‌సీకి వెళ్లి .నెల రోజులకు మందులు తెచ్చుకునేవాడిని. ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ విధానం వచ్చిన తర్వాత మా గ్రామంలోనే వైద్యసేవలందిస్తున్నారు. శనివారం మా గ్రామంలో నాకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులు ఇచ్చారు. ఏమి తినాలో..తినకూడదో కూడా చెప్పారు.

– బోర దేముళ్లు, గుల్లేపల్లి గ్రామం

నెలకు రెండు రోజులు వైద్యశిబిరాలు

నెలకు రెండు రోజులు క్లినిక్ పరిధిలో పీహెచ్‌సీ వైద్యాధికారులతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. క్లినిక్‌లకు రోజుకు 30 నుంచి 40 మంది వరకు రోగులు సేవలు పొందుతుండగా, క్లినిక్‌ల పరిధిలో నెలకు రెండు దఫాలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్లో వంద మందికి పైగా సేవలు పొందుతున్నారు. వైద్య సేవలు చేరువ చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విశేష సేవలు

- సబ్బవరం పీహెచ్‌సీ పరిధిలో 13 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. చినయాతపాలెం గ్రామ విలేజ్ క్లినిక్‌లో శనివారం సబ్బవరం పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.ఎన్. ఆర్ చక్రవర్తి క్యాంపులో పాల్గొన్నారు. 90 మంది వరకు ఓపీ నిర్వహించారు. బీపీ, సుగర్ పేషెంట్లు, గర్భిణులు, బాలింతలు, జనరల్ పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. వీరితో పాటు సీజనల్ జ్వరాలు, కళ్ల కలకలు అధికంగా గుర్తించి వైద్య సేవలు అందించారు.
- పరవాడ మండల పరిధిలో రెండు పీహెచ్‌సీలున్నాయి. మొదటి వారం, మూడో వారం పరవాడ పీహెచ్‌సీ పరిధిలో...రెండో వారం, నాల్గో వారం వాడచీపురపల్లి పీహెచ్‌సీలో వైద్యసేవలందిస్తారు. అందులో భాగంగా శనివరాం వాడచీపురపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ధర్మారాయుడు పేట విలేజ్ క్లినిక్‌లో డాక్టర్ క్రాంతి వైద్యసేవలందించారు. 82 మందికి మందులు అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

సింహాచలం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం పాత పెందుర్తికి చెందిన వ్యక్తి మృతి ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాత పెందుర్తికి చెందిన మళ్ల మధుకుమార్ (37) సరిపల్లిలో భార్య వెంకటకుమారి, కొడుకు సాయి(6)తో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఖాళీగా ఉండడంతో మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు కొడుకు కూడా అనారోగ్యం బారిన పడ్డాడు. ఈ తరుణంలో భార్య టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. కాగా ఇటీవల భార్యను మధు రాజమండ్రి సమీపంలోని మండపేటలో ఉన్న ఆమె పుట్టింటిలో దింపాడు. శనివారం రాత్రి ఇంట్లో గడియ పెట్టుకుని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూసేసరికి ఎంతకీ తలుపు తియలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసలు తలుపులు బద్దలు కొట్టి వెళ్లి చూడగా మధుకుమార్ ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మద్యానికి బానిస కావడం, ఆర్థిక సమస్యలతో పాటు కుమారుడు ఆరోగ్యం బాగోలేక పోవడంతోనే మధు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత

సింహాచలం: వార్డులోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పించేందుకు కృషి చేస్తానని 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత తెలిపారు. వార్డు పరిధి వికలాంగుల కాలనీలో సుమారు రూ.18లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ పనులకు ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు శానాపతి శంకరరావు, అవగడ్డ అప్పలనాయుడు, కిల్లి రమేష్, మేడిశెట్టి అర్జున్, మేడిశెట్టి త్రినాథ్ పాల్గొన్నారు.

చలసాని ఆశయాలు కొనసాగిద్దాం



మాట్లాడుతున్న విప్లవ రచయిత సంఘం రాష్ట్ర నేత ప్రసాద్

సీతంపేట: మార్క్సిజాన్ని సమాజానికి అన్వయించి.. పరిశీలించే దృష్టితో చూసినప్పుడే వాస్తవ పరిస్థితులు అర్థం అవుతాయని నమ్మే వ్యక్తి చలసాని ప్రసాద్ అని విప్లవ రచయిత సంఘం రాష్ట్ర నేత సి.ఎస్.ఆర్ ప్రసాద్ అన్నారు. మార్క్సిస్టు మేధావి, విప్లవ రచయిత చలసాని ప్రసాద్ 8వ వర్ధంతి సందర్భంగా 'నేటి రాజకీయాలు సాహిత్యం' అనే అంశంపై శనివారం పౌరగ్రంథాలయంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్సిజాన్ని చలసాని ప్రసాద్ ముందుగా జీవితానికి అన్వయించుకుని, ఆ దిశగా కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేశారన్నారు. స్టాలిన్ హింసాకాండపై అనేక మంది విమర్శించినప్పటికీ.. చలసాని మాత్రం స్టాలిన్ చేసిందే సరైందని అన్నారని తెలిపారు. ఆ రోజుల్లో స్టాలిన్ ఆ విధంగా వ్యవహరించకపోతే అమెరికా, జర్మనీ కలిసి సోషలిజాన్ని కూల్చివేసేవారని చలసాని చెప్పేవారన్నారు. బీజేపీ అమలు చేస్తున్న మతతత్వ ఫాసిజాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్రలో ప్రజా ఉద్యమాలకు తలలో నాలుకగా వ్యవహరించిన కలం యోధుడు చలసాని ఆశయాలను కొనసాగించాలన్నారు. వీక్షణం సంపాదకుడు ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ బీజేపీ పాలకులు హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హిందూమతం పేరుతో కలహాలు సృష్టిస్తున్నారని చలసాని చెప్పేవారన్నారు. ప్రముఖ రచయిత్రి మల్లీశ్వరి 'వర్తమానం చలసాని ప్రాసంగికత' అనే అంశంపై, ప్రముఖ రచయిత ఆచార్య చందు సుబ్బారావు 'చలసాని వ్యక్తిత్వం నిబద్ధత' అనే అంశంపై, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం అధ్యక్షుడు జె.వి.సత్యనారాయణమూర్తి 'భారతదేశంలో ప్రజాస్వామ్యం, భవిష్యత్' అనే అంశంపై ప్రసంగించారు. ముందుగా చలసాని చిత్రపటానికి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, ఇప్టా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, జర్నలిస్టు సి.ఎస్.క్షేత్రపాల్ రెడ్డి, చైతన్య మహిళా సంఘం ప్రతినిధి కె.లలిత, పౌరసంఘాల సమన్వయకర్త పి.చంద్రశేఖర్, న్యాయవాది పద్మ పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

- అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు
- ఘనంగా స్వర్ణపుష్పార్చన
- విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దీంతో క్యూ లైన్లు రద్దీగా కనిపించాయి. ఆధ్యాత్మికత ఉట్టిపడింది. వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. విశేషంగా హారతులు ఇచ్చారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సినీ పరిశ్రమకు కోవిడ్ కొత్త పాఠాలు



మాట్లాడుతున్న సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్

సీతంపేట(విశాఖ ఉత్తర): కోవిడ్ మహమ్మారి సినీ పరిశ్రమతో పాటు ప్రేక్షకులకు కొత్త పాఠాలు నేర్పిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో 'కోవిడ్ తర్వాత ప్రపంచ సినిమా పరిస్థితి' అంశంపై ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఇళ్లల్లో కూర్చొని తమకు నచ్చిన సినిమా వీక్షించే అవకాశం కలిగిందన్నారు. ప్రేక్షకులు సినిమాలు చూసే విధానం కూడా మారిందన్నారు. ముఖ్యంగా సినిమా హాళ్లకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య బాగా తగ్గిందని అభిప్రాయపడ్డారు. మన సినిమాలు ఇతర భాషా చిత్రాలతో పోల్చుకునే అవకాశం కలిగిందన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆర్పీ జవాబులిచ్చారు. ఫిల్మ్ సొసైటీ సభ్యులు పి.ఎస్.మూర్తి పెన్సిల్‌తో గీసిన స్కెచ్‌ను ఆయనకు బహూకరించారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ పట్నాయక్ సంగీత దర్శకత్వం వహించిన పలు చిత్రాలతో త్వరలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, బాబ్జి, కుమారి, అనురాధ, శివన్నారాయణ, చంద్రశేఖర్, రాజీవ్ పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోలో కొనసాగుతున్న దీక్షలు



స్టీల్ సిటీ డిపో దీక్షలో పాల్గొన్న కార్మికులు

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపోలో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో డివిజనల్ అధ్యక్షుడు వి.ఎస్.ఆర్. మూర్తి ఆదివారం 10వ రోజు దీక్షలను ప్రారంభించారు. బస్సులకు స్పేరు పార్టులు ఇప్పించాలని, అన్యాయంగా జీతం కోత విధించిన వారికి జీతాలు ఇవ్వాలని, సిక్ అయిన సందర్భంలో రోజుల తరబడి విధులకు తీసుకోకుండా వేధించే విధానం విడనాడాలని, ఓటీ, నైట్ షిఫ్ట్ అలవెన్స్‌లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో జె.ఎల్. రావు, ఎ.వి. రమణ, డి. రాము, జె.ఎస్. రావు కూర్చున్నారు.

కేంద్రానికి కనువిప్పు కలిగే వరకు ఉక్కు ఉద్యమం



దీక్షలో పాల్గొన్న కార్మికులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు ఉక్కు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 892వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో ఇంటక్ ప్రతినిధులు, కార్మికులు కూర్చున్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్లనే దేశంలో ఆర్థికాభివృద్ధి జరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ రంగ సంస్థల పట్ల కేంద్రం పునరాలోచించుకోవాలన్నారు. కార్మిక హక్కులు అమలు కావాలన్నా, నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడం కోసం కార్మిక వర్గం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యకమంలో పోరాట కమిటీ నాయకుల, కార్మికులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న కొండంత హనుమంతుడు



హనుమంతవాక వద్ద సిద్ధమవుతున్న ఆంజనేయస్వామి విగ్రహం

ఆరిలోవ: హనుమంతవాక వద్ద పేరుకు తగినట్టు హనుమాన్ విగ్రహం రూపుదిద్దుకుంటోంది. సుమారు 40 అడుగుల ఎత్తులో ఆంజనేయ స్వామి విగ్రహం ఇక్కడ సిద్ధమవుతోంది. బీఆర్‌టీఎస్ కూడలి సమీపంలో ఆరిలోవ వైపు వెళ్లే రోడ్డు పక్కన జీవీఎంసీ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. విశాలమైన ఖాళీ ప్రదేశంలో కొండ దిగువన ఏర్పాటు చేస్తున్న ఈ విగ్రహం అటుగా వెళ్లే వాహనచోదకులను, స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొద్ది రోజుల్లో ఈ విగ్రహావిష్కరణ జరగనుందని జీవీఎంసీ అధికారులు తెలిపారు.

అధికారుల తీరుపై బాధితుల నిరసన

స.హ. చట్టాన్ని నీరుగార్చుతున్నారని ఆరోపణ

అగనంపూడి: విధి నిర్వహణలో ఉక్కు కర్మాగారం ఆవరణలో ఉక్కు అధికారి మరణిస్తే కనీసం విచారణ జరపకుండా ఆన్‌డ్యూటీలో మరణించలేదని ఉక్కు యాజమాన్యం బుకాయించడం, వారి తప్పులను కప్పిపుచ్చే విధంగా ఫ్యాక్టరీస్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సమాధానం ఉందని సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు, మృతుని భార్య బంగారమ్మ ఆరోపించారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఐదేళ్ల కిందట విశాఖ ఉక్కులో విధులు నిర్వహించే అధికారి నాగ్ర తాతారావు విధి నిర్వహణలో మరణించారని, నాలుగు రోజుల తర్వాత మృతదేహం కనపడిందని, అయితే తాతారావు ఆన్‌డ్యూటీలో మృతి చెందలేదని యాజమాన్యం బుకాయించడంతో రాష్ట్రపతికి ఫిర్యాదు చేశామన్నారు. విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి కార్యాలయం రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తే వాటికి నేటికీ సమాధానం లేకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. రాష్ట్రపతి ఆదేశాలను కూడా లెక్కచేయని పరిస్థితి ఉండడం బాధాకరమన్నారు. అలాగే విచారణ జరిపిన కర్మాగారాల ఉప ముఖ్య తనిఖీ అధికారి ఫ్యాక్టరీస్ చట్టం ప్రకారం ఎటువంటి చర్యలు తీసుకోలేమని లేఖ ద్వారా సరిపెట్టడం యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నట్టు ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో కార్యవర్గ సభ్యులు

డాబాగార్డెన్స్ : రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో 2023–24 ఏడాదికి నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో క్లబ్ అధ్యక్షుడిగా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ కె. కిరణ్‌కుమార్, క్లబ్ కార్యదర్శిగా కూటికుప్పల రవికిరణ్ ప్రసాద్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్, రోటరీ జిల్లా పూర్వ గవర్నర్ రోటేరియన్ భాస్కర్ రామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎండాడలో క్లబ్ నిర్వహిస్తున్న మహిళా సాధికారత కేంద్రం, హుకుంపేటలో నిర్వహిస్తున్న గిరిజన మహిళా సాధికారత కేంద్రం ఏర్పాటు చేసిన పూర్వ అధ్యక్షురాలు సునీత లావణ్యను అభినందించారు. కార్యక్రమంలో సునీత లావణ్య, ఎస్. గాయత్రి, మొదిలి మహేష్, మిరియాల వేణు, గోపాల్, డాక్టర్ ఎం. గంగాధర్, పరశురామరాజు, సత్యశ్రీ, పద్మజ, వైవీవీ సత్యనారాయణ, ఎ. కిరణ్, కేవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సంత్ సమాగం



బృందగానం ద్వారా సత్య సందేశాన్ని ఇస్తున్న చిన్నారులు



మానవ జన్మ లక్ష్యాన్ని లఘు నాటిక రూపంలో ప్రదర్శిస్తున్న చిన్నారులు

డాబాగార్డెన్స్ : పాతనగరం వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం సంత్ నిరంకారీ మండలి ఆధ్వర్యంలో విశాల యువ–బాలల సంత్ సమాగం నిర్వహించారు. మండలి హైదరాబాగ్ జోనల్ హెడ్ క్వార్టర్స్ నుంచి విశాల్ ఖరానా, విశాఖ శాఖ సహ సంయోజకుడు పీవీ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 80 మంది యువకులు, బాల బాలికలు పాల్గొని లఘు నాటికలు, బృందగానం, ప్రసంగాలు, కవిత్వాలు నిర్వహించారు. మానవత్వపు గుణాలతో ప్రదర్శించిన లఘు నాటికలు ప్రతినిధులను ఆకర్షించాయి. సద్గురు సత్య సందేశాన్ని మానవాళికి అందించారు. ఈ సందర్భంగా విశాఖ సంత్ నిరంకారీ మండలి సంయోజకుడు ప్రేమ్‌మిర్‌పూరి మాట్లాడుతూ బ్రహ్మజ్ఞానం ద్వారా పరమాత్మను అనుభవపూర్వకంగా తత్వరూపంలో తెలిపారు. మానవ జన్మ లక్ష్యాన్ని నెరవేర్చే ప్రయత్నంపై వివరించారు. నేటి బాలలే భావిపౌరులు కాబట్టి.. చిన్న వయస్సు నుంచే పిల్లల్లో ఆధ్యాత్మిక జాగృతి రావాలని, అందుకు ఇటువంటి కార్యక్రమాలు ముఖ్యమన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి నిరంకారీ భక్తులు పాల్గొన్నారు.

11 నుంచి అష్టలక్ష్మీ మహాయాగం

సీతంపేట: అధిక శ్రావణ మాసం సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో వచ్చే నెల 11 నుంచి 16 వరకు అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగం నిర్వహించనున్నట్లు కుర్తాళ పీఠం ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్ శర్మ తెలిపారు. లలితా పీఠంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాగానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక మాసం విష్ణువు, లక్ష్మీదేవికి అత్యంత ప్రీతిపాత్రమని, అటువంటి మాసంలో జరిగే అష్టలక్ష్మీ యాగంలో పాల్గొన్న వారికి సిరిసంపదలు, అధికార, ధనప్రాప్తి కలుగుతాయన్నారు. భక్తులందరూ ఈ సత్ఫలితాలు పొందేలా లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో వచ్చే నెల 11వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు మహా సంకల్పంతో యాగం ప్రారంభమవుతుందని చెప్పారు. 12 నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజూ అష్టలక్ష్మీ యాగం, స్వర్ణ పుష్పార్చన, 16వ తేదీ ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు అష్టలక్ష్మీ సమేత నారాయణ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ మాట్లాడుతూ జగద్గురువు, కుర్తాళం శంకరాచార్య సన్నిధిలో మొట్టమొదటిసారిగా పంచావాహ్నిక అష్టలక్ష్మీ మహాయాగం, తొలిసారిగా అష్టలక్ష్ములతో నారాయణ కల్యాణం జరుగుతాయని వెల్లడించారు. యాగంలో పాల్గొన దలచిన భక్తులు 98492 86779, 89777 88055 నంబర్లలో గాని, పీఠం కార్యాలయంలో గాని సంప్రదించాలని కోరారు.